సాక్షి

పశ్చిమగోదావరి

సోమవారం । 4 । మార్చి । 2024



హరహర మహాదేవ..

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబవుతున్నాయి.

8లో

వైఎస్సార్ సీపీలోకి చేరికలు

భీమవరంలో తెలుగుదేశం పార్టీకి చెందిన రజకులు ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

8లో



హైదరాబాద్ వెళ్లి పింఛన్లు

లబ్ధిదారులు ఎంత దూరంలో ఉన్నా వారికి సకాలంలో పింఛను అందిస్తూ వలంటీర్లు సేవాభావం చాటుతున్నారు.

8లో

న్యూస్‌రీల్

క్రీడలతో నూతనోత్తేజం



క్రికెట్ ఆడుతున్న ఏఎస్పీ రవికుమార్

పాలకొల్లు సెంట్రల్ : విధి నిర్వహణలో ఒత్తిళ్లను ఎదుర్కొనే పోలీసులకు క్రీడలతో నూతనోత్తేజం కలుగుతుందని అడిషినల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నరసాపురం డివిజన్, భీమవరం డివిజన్‌లకు చెందిన పోలీసుల క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. భీమవరం డివిజన్ నుంచి అడిషినల్ ఎస్పీ రవికుమార్, భీమవరం రూరల్ సీఐ సత్యకిషోర్, వన్‌టౌన్ ఎస్సై వెంకటేశ్వరరావు, భీమవరం సబ్ డివిజన్ పోలీసులు అలాగే నరసాపురం సబ్ డివిజన్ నుంచి పాలకొల్లు రూరల్ సీఐ కుడుపూడి సతీష్, పట్టణ ఎస్సై బాదం శ్రీనివాస్, పోడూరు ఎస్సై డి.రామ్‌కుమార్, సబ్ డివిజన్ సిబ్బంది కలిసి రెండు జట్లుగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నరసాపురం జట్టు 15 ఓవర్లలో 102 పరుగులు చేయగా భీమవరం జట్టు 15 ఓవర్లలో 96 పరుగులు చేసి ఓటమిపాలైంది.

టెట్‌కు 89.7 శాతం హాజరు

భీమవరం: జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఏపీ టెట్ పరీక్షకు 89.7 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. పరీక్షలకు 880 మంది అభ్యర్థులకు 789 మంది హాజరయ్యారన్నారు. రెండు స్పెషల్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేయగా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సాగుతున్నాయి. ఆరో రోజు ఆదివారం 661 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం 365 మందికి 327 మంది, మధ్యాహ్నం 365 మందికి 334 మంది హాజరయ్యారని, ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు.

నేడు భీమవరంలో పోలీస్ స్పందన

భీమవరం: ప్రతి సోమవారం నిర్వహించే పోలీస్ స్పందన కార్యక్రమాన్ని భీమవరం గొల్లలకోడేరు రోడ్డులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎస్పీ కార్యాలయం ప్రకటనలో తెలిపింది. బాధితుల నుంచి జిల్లా ఎస్పీ అజిత ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొంది.

పోలింగ్ శాతం పెంచాలి



మాజీ సైనికులతో మాట్లాడుతున్న డీపీఓ

ఏలూరు(మెట్రో) : రానున్న ఎన్నికల్లో జిల్లాలో పోలింగ్ శాతం పెంచే లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాలు జోరుగా జరుగుతున్నాయని స్వీప్ నోడల్ అధికారి, డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శర్మ అధ్యక్షతన స్వీప్ కార్యక్రమాలపై మాజీ సైనికులతో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీపీఓ విశ్వనాథ్ మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో 79.77 శాతం, జిల్లాలో 83.75 శాతం పోలింగ్ నమోదయ్యిందన్నారు. జిల్లాలో అత్యల్పంగా ఏలూరు నియోజకవర్గంలో ఓటింగ్ 68.10 తంగా ఉందని, ఇది రాష్ట్ర సగలు కంటే తక్కువన్నారు. పట్టణ ప్రాంతాల్లోని ఎగువ శ్రేణి వర్గం, యువత ఓటింగ్ ప్రక్రియలో భాగస్వామ్యం కాకపోవడమే ఇందుకు కారణమన్నారు. దీంతో రానున్న ఎన్నికల్లో 92 శాతం పోలింగ్ నమోదయ్యేలా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఓటర్స్ టర్నవుట్ ప్రణాళికను ఆమోదించారని, దీనిలో భాగంగా స్వీప్ కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతూ ఓటర్లను చైతన్య పరుస్తున్నామని చెప్పారు. జిల్లావ్యాప్తంగా మాజీ సైనికుల కుటుంబాలతో జిల్లా సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఓటర్ల అవగాహనా కార్యక్రమాలు చేపడతామని జిల్లా సైనిక సంక్షేమ అధికారి వెంకట సాయి అన్నారు. త్వరలో ప్రజల భాగస్వామ్యంతో ర్యాలీలు, మానవహారాలు చేపడతామన్నారు. ముందుగా డీపీఓ విశ్వనాథ్ అమర్ జవాన్ స్థూపం వద్ద వందనం చేశారు.

వేగవరంలో పారా మిలటరీ సిబ్బంది

జంగారెడ్డిగూడెం రూరల్ : రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా విధులు నిర్వహించే పారా మిలిటరీ సిబ్బందికి మండలంలోని వేగవరం నోవా ఇంజనీరింగ్ కళాశాలలో వసతి సౌకర్యం ఏర్పాటుచేశారు. జంగారెడ్డిగూడెం సీఐ రాజేష్, ఎస్సై జ్యోతి బసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



తాడేపల్లిగూడెం రూరల్ : దండగర్రలో పోలియో చుక్కలు వేస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తణుకు అర్బన్ : తణుకులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



పెనుగొండ : సిద్ధాంతంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు



నరసాపురం : నరసాపురంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

రెండు చుక్కలు.. నిండు నూరేళ్లు

జిల్లావ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభమైంది. నవజాత శిశువుల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కల పోలియో మందు భరోసాగా నిలుస్తుందని ప్రజాప్రతినిధులు అన్నారు. పలుచోట్ల చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియోను వారు ప్రారంభించారు.

– సాక్షి నెట్‌వర్క్

97.64 శాతం పల్స్ పోలియో

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లావ్యాప్తంతా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా సాగిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. జిల్లాలో 1,315 పబ్లిక్ బూత్‌లు, 45 మొబైల్ బూత్‌లు, 34 ట్రాన్సిస్ట్ బూత్‌లలో 5,520 మంది వ్యాక్సినేటర్ల ద్వారా పిల్లలకు పోలియో చుక్కలు వేశామన్నారు. జిల్లాలో 181 రూట్లకు ఒక్కో వాహనం చొప్పున ఏర్పాటుచేశామన్నారు. పోలియో చుక్కలు వేసుకోని పిల్లల కోసం సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వైద్య సిబ్బంది వెళతారన్నారు. జిల్లాలో 1,85,953 మంది చిన్నారులకు 1,81,565 మందికి పోలియో చుక్కలు వేసి 97.64 శాతం లక్ష్యం సాధించామని డీఎంహెచ్‌ఓ మహేశ్వరరావు తెలిపారు.

పశు బీమా.. రైతుకు ధీమా

- పాడి రైతులను ఆదుకునేలా వైఎస్సార్ పశు బీమా పథకం
- జిల్లాలో 5,594 మూగజీవాలకు బీమా సౌకర్యం
- ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులకు 80 శాతం ప్రీమియం రాయితీ
- ఇప్పటివరకు 40 పశువులకు రూ.12 లక్షల బీమా పరిహారం చెల్లింపు



కొమరాడలో బీమా చేసిన గేదెతో రైతు



దిరుసుమర్రులో బీమా చేసిన ఆవుతో..

భీమవరం(ప్రకాశం చౌక్): పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ పశు బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. గతంలో ఉన్న పశు నష్ట పరిహారం పథకం స్థానంలో గతేడాది జూన్‌లో వైఎస్సార్ పశు బీమా పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. ఈ పథకంలో భాగంగా బీమా చేసిన పశువులు అగ్ని ప్రమాదం, రోడ్డు ప్రమాదం, విద్యుత్ షాక్ లేదా జబ్బులు బారిన పడి, ఆపరేషన్ చేసిన తర్వాత చనిపోతే బీమా పరిహారం అందిస్తారు. పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన పాడి రైతులు పశువులు ద్వారా ఉపాధి పొందుతున్న సమయంలో పశువులకు ప్రమాదాలు జరిగితే తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటువంటి వారిని ఆదుకునేలా ప్రభుత్వం పశు బీమా పథకాన్ని పక్కాగా అమలుచేస్తోంది.

80 శాతం వరకు ప్రీమియం రాయితీ

పశువులు కలిగిన ఎస్సీ, ఎస్టీ, తెల్లరేషన్ కార్డు కలిగిన పాడి రైతులు బీమా కంపెనీకి ప్రీమియంలో 80 శాతం, ఇతర రైతులు 50 శాతం చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుంది. ఈ పథకంలో ప్రభుత్వం రూ.30 వేలకు బీమా చేయిస్తుంది. రూ.30 వేలకు పైగా ఎంత మొత్తం బీమా చేయించుకుంటే ఆ మొత్తానికి పూర్తి ప్రీమియాన్ని రైతులు చెల్లించాల్సి ఉంటుంది. రూ.30 వేల బీమాకు గడువు మూడేళ్ల పాటు ఉంటుంది.

గతేడాది జూన్ నుంచి..

జిల్లాలో గతేడాది జూన్‌లో పథకం ప్రారంభం కాగా ఇప్పటివరకు ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు మొత్తం 5,594 మూగజీవాలకు బీమా చేశారు. లబ్ధిదారుల వాటా పోను ప్రీమియం రాయితీ కింద ఇప్పటివరకు ప్రభుత్వం రూ.71.76 లక్షలు చెల్లించింది. ప్రమాదవశాత్తు 46 పశువులు మరణించగా వాటిలో ఇప్పటివరకు 40 పశువులకు రూ.12 లక్షల బీమా పరిహారాన్ని సంబంధిత రైతులకు అందజేసింది.

బీమా వివరాలు

- రూ.30 వేల విలువైన గేదె, ఆవుకు మూడేళ్ల బీమా ప్రీమియం రూ.1,920. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు రూ.384, ఏపీఎల్ లబ్ధిదారులు రూ.960 చెల్లిస్తే మిగిలిన ప్రీమియం ప్రభుత్వం భరిస్తుంది.
- రూ.15 వేల విలువైన గేదె, ఆవుకు మూడేళ్ల బీమా ప్రీమియం రూ.960, ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు రూ.192, ఏపీఎల్ లబ్ధిదారులు రూ.480 చెల్లిస్తే మిగిలిన ప్రీమియం ప్రభుత్వం భరిస్తుంది.
- రూ.6 వేల విలువైన గొర్రె, మేకకు ఏడాది బీమా ప్రీమియం రూ.180. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు రూ.35, ఏపీఎల్ లబ్ధిదారులు రూ.90 చెల్లిస్తే మిగిలిన మొత్తం ప్రభుత్వం భరిస్తుంది.
- రూ.6 వేల విలువైన మేక, గొర్రెకు మూడేళ్ల ప్రీమియం రూ.275. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు రూ.75, ఏపీఎల్ లబ్ధిదారులు రూ.187.50 చెల్లిస్తే మిగిలిన మొత్తం ప్రభుత్వం చెల్లిస్తుంది.
- రూ.6 వేల విలువైన మేక, గొర్రెకు రెండేళ్ల బీమా ప్రీమియం రూ.270. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు రూ.54, ఏపీఎల్ లబ్ధిదారులు రూ.135 చెల్లిస్తే మిగిలిన ప్రీమియం ప్రభుత్వం భరిస్తుంది.

రూ.30 వేల పరిహారం వచ్చింది



గతేడాది జూన్‌లో నా ఆవుకు వైఎస్సార్ బీమా పథకంలో ప్రభుత్వం ఇచ్చిన ప్రీమియం చెల్లింపు రాయితీని ఉపయోగించుకుని బీమా చేయించాను. కొన్ని నెలలకు మా ఆవు ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.30 వేల బీమా పరిహారం సొమ్ములు వచ్చాయి. చిన్న పాటి పాడి రైతులకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది.

– ఎం.వినయ్, లబ్ధిదారుడు, చినఅమిరం

అందరూ ఉపయోగించుకోవాలి



పాడి, ఇతర రైతులు వైఎస్సార్ పశు బీమా పథకాన్ని ఉపయోగించుకోవాలి. ఎస్సీ, ఎస్టీ, తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి 80 శాతం, ఇతరులకు 50 శాతం మేర ప్రీమియం రాయితీ ఉంటుంది. రైతులు మిగిలిన మొత్తం చెల్లిస్తే సరిపోతుంది. ఆవులు, గేదెలకు మూడేళ్లు, గొర్రెలు, మేకలకు ఏడాది నుంచి మూడేళ్ల వరకు బీమా చేయించుకోవచ్చు.

–కె.మురళీకృష్ణ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

ఆర్‌బీకేల ద్వారా దరఖాస్తు

గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లోని (ఆర్‌బీకే) పశు సంవర్ధశాఖ సహాయకులు లేదా వెటర్నరీ అసిస్టెంట్ ద్వారా బీమా చేయించుకోవచ్చు. పాడి రైతులు ఆధార్ కార్డు, రేషన్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్సులు, పశు యాజమాని, పశువుకు వేసిన ట్యాగ్ నంబర్‌తో ఫొటో సమర్పించాల్సి ఉంటుంది.

‘ఎగిరే జగనన్న పతాకం’ పోస్టర్ ఆవిష్కరణ



తణుకులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: సీఎం జగన్‌పై అభిమానంతో తణుకుకు చెందిన యువత ‘ఎగిరే జగనన్న పతాకం’ అనే గీతాన్ని రూపొందించడం అభినందనీయమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఆదివారం సాంగ్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను పాటల రూపంలో ఆవిష్కరించడం సంతోషదాయకమన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఈ పాట ప్రతిబింబిస్తుందన్నారు. సాంగ్ డైరెక్టర్ పెంటపాటి మధుకుమార్, రచన వీరా శ్రీరామ్, సంగీతం ఎస్.ఆనంద్, గానం ఎస్.శివను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడు వీరమల్లు ఫణీంద్రకుమార్, పట్టణ యూత్ విభాగం అధ్యక్షుడు చేశెట్టి లలితా శంకర్, మెహర్ అన్సారీ, ఉండ్రాజవరపు గీత, ఝాన్సీ లారెన్స్, ఎం.లలిత, కుడుపూడి చంద్రరావు, పుల్లెపు సూర్యచంద్రరావు, రేలంగి రాంబాబు, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు సహకరించాలి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ఆక్రమణల తొలగింపునకు రైతులు, ప్రజలు సహకరించాలని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని దండగర్ర పంచాయతీ పరిధి లింగారాయుడిగూడెంలో రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. గతంలో గ్రామంలో వర్షాలు వస్తే మునిగిపోయే పరిస్థితి ఉందని, దీనికి డ్రెయినేజీ ఆక్రమణలే కారణమన్నారు. త్వరలో గ్రామంలో సర్వే చేసి ఆక్రమణలను తొలగిస్తామని, ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణానికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో, అదనంగా నిధులు ఇచ్చానని గుర్తుచేశారు. గత పాలకులు లింగారాయుడిగూడెం గ్రామాన్ని పట్టించుకోలేదని విమర్శించారు.

రామాలయ నిర్మాణానికి శ్రీకారం

గ్రామంలో చారిత్రక రామాలయ నిర్మాణాన్ని సంకల్పించి పది రోజులు గడవక ముందే శంకుస్థాపన చేశామని మంత్రి కొట్టు అన్నారు. దండగర్రలో రూ.1.15 కోట్లతో చేపట్టిన రామాలయ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అవసరమైతే మరో రూ.15 లక్షల వరకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆధ్యాత్మిక కేంద్రంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని నిలిపేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆరుగొలను నుంచి నవాబుపాలెం వరకు రూ.7 కోట్లతో ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో రోడ్డు మంజూరు చేశామన్నారు. తాడేపల్లిగూడెం రోడ్డుపై మరమ్మతులకు రూ.50 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. డ్రెయినేజీ వ్యవస్థకు మరో రూ.25 లక్షలు ఇచ్చామన్నారు. గ్రామంలో అభివృద్ధి చేసిన వ్యక్తి ఎవరో ఆలోచన చేయాలని ప్రజలను కోరారు.

మభ్యపెట్టడం చంద్రబాబు నైజం

రాజ్యసభ సభ్యుడు బోస్



దొంగరావిపాలెంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యుడు బోస్, మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

పెనుగొండ: ప్రజలను, నాయకులను మభ్యపెట్టడం చంద్రబాబు నైజమని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ విమర్శించారు. ఆదివారం మండలంలోని దొంగరావిపాలెం, సిద్ధాంతం ఘటాల దిబ్బ, నక్కావారిపాలెం, చినమల్లం, సోమరాజు చెరువు, పెనుగొండల్లో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, పంచాయతీ భవనం, సిద్ధాంతం పెదపేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫారమ్‌లను శాసనమండలి కొయ్యే మోషేన్‌రాజు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలు, రైతు రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి డ్వాక్రా మహిళలను, రైతులను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. కనీసం పావలా వడ్డీ రుణం సైతం చెల్లించలేదని మండిపడ్డారు. అయితే సీఎం జగన్ ఇచ్చిన మాట కోసం రెండేళ్ల పాటు కరోనాతో ఆర్థిక వ్యవస్థ అధ్వానంగా మారినా, పేద కుటుంబాలకు మేలు చేసేలా రూ.6,500 కోట్ల రుణాలు మాఫీ చేశారన్నారు. అన్ని వర్గాలకు పారదర్శకంగా సంక్షేమాన్ని అందిస్తున్నారన్నారు. అయితే చంద్రబాబు ఏనాడు ఇచ్చిన మాటకు కట్టుబడలేదన్నారు. ఎవరెన్ని యత్నాలు చేసినా ప్రజల మద్దతు సీఎం జగన్‌కే ఉందన్నారు. మహిళలను నమ్ముకొని సీఎం జగన్ 175 స్థానాలు సాధించగలనన్న ధీమాతో ముందుకు సాగుతున్నారని, ప్రతిఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ పోడూరి గోవర్ధన, సర్పంచ్‌లు నక్కా శ్యామలాసోనీ, చింతపల్లి గనిరాజు, దంపనబోయిన రూప, ఉప సర్పంచ్ ఆకొెట్టి వరలక్ష్మి, ఎంపీటీసీలు చిన్నం ఏడుకొండలు, గుత్తుల సత్యవతి, పెచ్చెట్టి లలిత, షేక్ రిజ్వానా, తాడి సుబ్బిరెడ్డి, మండల కన్వీనర్లు నల్లిమిల్లి బాబిరెడ్డి, పలివెల శ్రీను, సాకా శ్రీను, కాసాని శ్రీను, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి నాటిక పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడాల గోపి

కళలకు నిలయం క్షీరారామం

పాలకొల్లు సెంట్రల్: కళలకు నిలయమైన పాలకొల్లుకు చిత్ర రంగానికి ఎంతోమంది కళాకారులను అందించిన ఘన చరిత్ర ఉందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. ఆదివారం పట్టణంలోని అద్దేపల్లి గంగరాజు సత్రం ప్రాంగణంలో పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో 15వ జాతీయస్థాయి నాటికల పోటీలు ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే అల్లు వెంకట సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా గుడాల గోపి మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన కళాకారులను అందించిన కళామతల్లి ఒడిలో తాను ఓ సభ్యుడిని కావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కళలను ఆదరించే కళాకారులు ఉన్నంత వరకూ నాటక రంగానికి ఆదరణ తగ్గదన్నారు. ఇటువంటి కళాపరిషత్‌లు మరిన్ని ఏర్పాటుచేసి నూతన కళాకారులను వెలుగులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాకారులకు పెన్షన్ అంశం పెండింగ్‌లో ఉందని సీఎం జగన్‌తో మాట్లాడి కళాకారుల పెన్షన్ సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానన్నారు. పట్టణంలోని ఓపెన్ ఎయిర్ థియేటర్ కళాక్షేత్రాన్ని త్వరలో ప్రారంభించేలా కృషి చేస్తానన్నారు. అనంతరం స్వప్నం రాల్చిన అమృతం, ఎనిమీ నాటికలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి సభ్యుడు మేకా శేషుబాబు, యడ్ల తాతాజీ, సాలా నర్సయ్య, డీటీడీసీ బాబు, చిట్టూరి కనకదుర్గ ఏడుకొండలు, ఖండవల్లి వాసు, రాయప్రోలు భగవాన్, చవ్వాకుల సత్యనారాయణమూర్తి, నిట్టల శైలజ, దేగల ప్రభావతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

30 కాసుల బంగారు ఆభరణాలు అపహరణ

ఆకివీడు: ఆకివీడులో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగి 30 కాసుల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. ఎస్సై బి.నాగబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ సమీపంలో వెల్డింగ్ షాపు ఇంటి యజమాని సోదాబత్తుల బాలాజీ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం సాయంత్రం ఇంటికి తాళాలు వేసి ద్వారకాతిరుమల దర్శనానికి వెళ్లి ఆదివారం ఉదయం తిరిగి వచ్చారు. ఇంటికి వేసిన తాళాలు బద్దలకొట్టి ఉన్నాయని, ఇంటి వెలుపల ఉన్న ఇనుప నిచ్చెన పైనుంచి దొంగలు పైఅంతస్తులోకి ప్రవేశించి తలుపు తాళాలు బద్దలుకొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. వేలిముద్ర నిపుణులను రప్పించి ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కోడిపందేలపై దాడి

రమణక్కపేట (ముసునూరు): రమణక్కపేటలో కోడిపందేల శిబిరంపై ఆదివారం దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పి.వాసు చెప్పారు. నిందితుల నుంచి రెండు కోడిపుంజులు, రూ.1,400 నగదు, ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను సోమవారం నూజివీడు కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కామవరపుకోట: రావికంపాడు పంచాయతీ పరిధిలోని వెంకటాపురం శివారులో అనుమానాస్పద స్థితిలో ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. తడికలపూడి ఎస్సై జయబాబు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటాపురం శివారులోని గిరమ్మ చెరువులోని ముళ్లపొదల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పశువుల కాపరులు ఆదివారం గుర్తించి గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్, తడికలపూడి ఎస్సై జయబాబు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వ్యక్తి మృతదేహం ఉబ్బిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉందని, 35 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉండవచ్చని, నలుపు రంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కా జాకీ కంపెనీ ఎరుపు రంగు డ్రాయర్, కుడి చేతి మణికట్టుపై ఎరుపు రంగు తాడు కలిగి ఉన్నాడని ఎస్సై తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. ఇదిలా ఉండగా, గుర్తు తెలియని వ్యక్తిని హత్య చేసి నాలుగు రోజుల క్రితమే ఇక్కడ చెరువులో పడేశారని గ్రామంలో ప్రచారం జరుగుతోంది.

జూదరుల అరెస్టు

జంగారెడ్డిగూడెం: కేతవరంలో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు స్టేషన్ రైటర్ పీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.2600 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు.

హరహర మహాదేవ.. శంభోశంకర

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. ఏలూరు జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో దక్షిణ కాశీగా పేరుగాంచిన బలివేలోని శ్రీరామ లింగేశ్వరస్వామి ఆలయం, జంగారెడ్డిగూడెం మండలం తాడువాయిలోని శ్రీభద్రకాళి సమేత వీరేశ్వరస్వామి వారి ఆలయాల్లో ప్రతి ఏటా మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివార్లకు కల్యాణోత్సవాలను కూడా ఏటా జరుపుతారు. ఉత్సవాల సందర్భంగా ఈ ఆలయాల వద్ద జరిగే తిరునాళ్ల లక్షలాది భక్తుల రాకతో కిటకిటలాడతాయి.

- మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న శైవక్షేత్రాలు
- బలివే, తాడువాయి ఆలయాల్లో భారీగా ఏర్పాట్లు
- దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏటా ఘనంగా నిర్వహణ
- లక్షలాదిగా హాజరుకానున్న భక్తులు



బలే రామస్వామి మూల విరాట్ స్వరూపం



బలివేలోని శ్రీరామలింగేశ్వరాలయం

ముసునూరు: బలివేలోని ప్రసిద్ధ పురాతన శైవక్షేత్రం శ్రీరామ లింగేశ్వరాలయం. శివయ్య కొలువైన చోట గంగమ్మ కూడా ఉంటుందనే భక్తుల విశ్వాసానికి తగినట్లుగా ఈ ఆలయం తమ్మిలేరు ఒడ్డున నెలకొని ఉంది. ఈ ఆలయం పూర్వపు కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నడుమ, ప్రాచీన తూర్పు వేంగి చాళుక్యుల రాజధాని వేంగిపురం (నేటి పెదవేగి)కి అతి సమీపాన పచ్చని పంటచేలు, కొబ్బరి, పామాయిల్, నిమ్మ తోటల నడుమ ప్రకృతి రమణీయతతో, ఆహ్లాదకర, ప్రశాంత వాతావరణంలో అలరారుతోంది.

ఆలయ స్థల పురాణం

ఈ దేవాలయం త్రేతాయుగంలో లింగ ప్రతిష్ఠ జరుపబడినట్లుగా ప్రతీతి. శ్రీరాముడు రావణ సంహారణానంతరం బ్రహ్మ హత్యా దోష నివారణార్థం మహాస్థలాలను ఎన్నుకుని అక్కడ శివలింగ ప్రతిష్ఠలు చేస్తూ అయోధ్యకు చేరారనేది నానుడి. ఈ క్రమంలో మహారణ్యమైన ఈ స్థలంలోని ఆహ్లాదకరమైన వాతావరణం చూసి, శివధ్యాన దృష్టిగల భూమిగా గ్రహించి శ్రీరాముడు ఇక్కడ లింగ ప్రతిష్ఠ గావించారు. సాక్షాత్తూ పరమశివుని ఆవాహనం చేసి పూజలు చేసి పరమశివుని కృపకు పాత్రులయ్యారు. ప్రసన్నుడైన పరమశివుడు ఈ అరణ్యంలో ఈ శివలింగం చుట్టుపక్కల నూరు లింగ ప్రతిష్ఠలు కాగలవని చెప్పాడు. ఈ ఆలయంలో తనను దర్శించిన భక్తుల సర్వకోరికలు తీరి, సకల దోషాలు హరింపబడతాయని, శివుడే రామునికి తెలిపియున్నారు. అప్పటి నుంచి ఈ ప్రదేశంలోని శివలింగాన్ని రాముడు ప్రతిష్ఠించిన కారణంగా రామలింగేశ్వర ఆలయంగా, తదనంతర కాలంలో ఈ ప్రాంతాన్ని బలి చక్రవర్తి పరిపాలించడంతో, బలివేగా పేరు గాంచింది. రాముడు ప్రతిష్ఠించిన శివలింగం కావడంతో ఆలయాన్ని బలే రామలింగేశ్వరస్వామి ఆలయంగా పిలవబడిందని భక్తుల నమ్మకం. ఆలయంలో అమ్మవారి ఆలయం కూడా ఉండాలని ఈ ప్రాంతానికే చెందిన మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్ 2011లో రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. ఈ గ్రామ పరిసరాలలో 101 లింగ ప్రతిష్ఠలుండేవి. కాలక్రమంలో అవి శిథిలమై నాలుగైదు మాత్రమే మిగిలాయి. వాటిలో ప్రముఖమైనది తాత గుడిగా ప్రసిద్ధి చెందిన మృత్యు మల్లేశ్వరాలయం. కల్యాణం అనంతరం స్వామివారు రథోత్సవంతో తరలివచ్చి, తాతగారి ఆశీస్సులు పొందడం ఆనవాయితీ.

బస్సులలో ఇలా చేరుకోవచ్చు

రెండు జిల్లాల సరిహద్దులో ఉన్న బలే రామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్న దృష్ట్యా మొత్తం ఐదు విభాగాలుగా నూజివీడు, ఏలూరు, సత్తుపల్లి ఆర్టీసీ డిపోల నుండి బస్సులను నడుపుతున్నారు. నూజివీడు నుంచి బలివే ఉత్సవ ప్రాంగణం వరకు, విసన్నపేట నుంచి రమణక్కపేట, చెక్కపల్లి మీదుగా బలివే వరకు, ఏలూరు నుంచి వేల్పుచర్ల మీదుగా బలివే వరకు, ఏలూరు నుంచి విజయరాయి మీదుగా బలివే వరకు, సత్తుపల్లి నుంచి చింతలపూడి మీదుగా బలివే వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది.

భారీగా ఏర్పాట్లు

దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని బలే రామలింగేశ్వరాలయానికి వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రతి ఏటా మహాశివ రాత్రి ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజులపాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు గ్రామ సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ జవహర్ బాజి నోడల్ అధికారిగా, నూజివీడు సబ్ కలెక్టర్ భవానీశంకరి, డీఎస్పీ జి.లక్ష్మయ్య నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే భక్తుల కోసం జల్లు స్నానాల ఏర్పాట్లు ప్రారంభించారు. త్వరలో ఉత్సవ ప్రాంగణానికి నీరు చేరుకుంటుందని అధికారులు చెబుతున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకోవాలని, ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగుల నాగేశ్వరరావు,ఈఓ సతీష్ కుమార్ కోరుతున్నారు.

6 నుంచి పంచారామక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు



శ్రీఉమాసోమేశ్వర స్వామి వారు

భీమవరం (ప్రకాశం చౌక్): పంచారామక్షేత్రం గునుపూడిలోని శ్రీఉమాసోమేశ్వర జనార్దన స్వామి వారి దేవస్థానంలో ఈనెల 6వ తేదీ నుంచి మహాశివరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు దాదాపు పూర్తికావచ్చాయి. ఉత్సవాలకు భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో వారికి అవసరమైన వసతులను కల్పిస్తున్నారు. దేవస్థానం లోపల బయట చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణ అధికారి డి.రామకృష్ణంరాజు ఉత్సవాల ఏర్పాట్లపై మాట్లాడారు. ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఈ నెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. 6న స్వామి వారికి రుద్రాభిషేకాలు, లక్షపత్రి పూజ, విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దంపతులతో అన్నపూర్ణదేవి అమ్మవారికి లక్ష కుంకుమపూజ, 7న లక్షపత్రి పూజ, స్వామివార్లకు గ్రామోత్సవం, 8న తెల్లవారుజామున అన్నపూర్ణ పార్వతీ దేవి సమేత శ్రీసోమేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం, 9న రథోత్సవం, 10న తెప్పోత్సవం నిర్వహిస్తామని వివరించారు.



పంచారామక్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

ఒకే క్షేత్రంలో రెండు శివాలయాలు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం తాడువాయిలోని శ్రీభద్రకాళి సమేత వీరేశ్వరస్వామి వారి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్షేత్రంలో ఈనెల 8వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు స్వామివారి దివ్య కల్యాణోత్సవాలు జరగనున్నాయి. 8న స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్రాభిషేకం, 9న స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం, 10న శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి వారి కల్యాణం, మధ్యాహ్నం అన్నసమారాధన, 11న శ్రీ అపర్ణా సమేత అనంతేశ్వరస్వామి దివ్య కల్యాణం, 12న స్వామి, అమ్మవార్ల శ్రీ పుష్పయాగం వంటి పూజలు నిర్వహించనున్నారు. ఇక్కడ జరిగే తిరునాళ్లకు జిల్లా నలుమూలల నుంచి విశేష సంఖ్యలో భక్తులు విచ్చేస్తుంటారు.





తాడువాయి శైవక్షేత్రం, గర్భగుడిలో స్వయంభువుగా వీరేశ్వరస్వామి వారి శివలింగం

ఒకే క్షేత్రంలో రెండు శివాలయాలు ఉండటంతో ఈ క్షేత్రం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఆలయాల్లో కొలువై ఉన్న వీరేశ్వరస్వామి, అనంతేశ్వరస్వామి దర్శనానికి తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పవన్ వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అధఃపాతాళానికి తొక్కేస్తానంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇటీవల ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం అతని అహంకారానికి నిదర్శనమని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు విమర్శించారు. తాడేపల్లిగూడెంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను నాలుగో పెళ్లాం అనడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇంకా రెండు నెలలు ఆగితే రాష్ట్ర ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెబుతారని, వైఎస్ జగన్ రెండోసారి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమన్నారు. అప్పుడు పవన్ కల్యాణ్‌కు వైఎస్ జగన్ పెళ్లాం అవుతారో, మొగుడే అవుతారో తెలుస్తుందన్నారు. 2019 ఎన్నికలలో రెండో చోట్ల ఓడిపోయి, ఒక చోట గెలిచిన ఆ ఎమ్మెల్యే కూడా వైఎస్సార్ సీపీలో చేరితే పవన్ వెర్రిముఖం వేశాడని ఎద్దేవా చేశారు. పవన్‌ను సీఎం చేయాలని అభిమానులు చూస్తుంటే పవన్ మాత్రం చంద్రబాబును సీఎం చేసేందుకు ప్రయత్నిస్తుండటం విడ్డూరమన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమన్నారు. రాష్ట్ర నాయకులు బీర సునీల్ బాబు, బి.సందీప్, వి.సునీల్ పాల్గొన్నారు.



చీకటిమిల్లి మంగరాజు

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ రజక నేతలు



టీడీపీ రజక నేతలకు వైఎస్సార్ సీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న విప్ గ్రంధి శ్రీనివాస్

భీమవరం: పేదల దగ్గర డబ్బుంటేనే కొనుగోలు శక్తి వస్తుందని, తద్వారా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 34వ వార్డుకు చెందిన సుమారు 50 మంది టీడీపీకి చెందిన రజకులు స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన గ్రంధి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సీఎం వైఎస్ జగన్ అన్ని విధాలా ప్రయత్నిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా నవరత్నాల పేరుతో అర్హులైన ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ఆ కుటుంబాలకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు మేలు జరిగేలా కృషి చేస్తున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తూ పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తూ వారిని ఇంజనీర్లు, డాక్టర్లుగా చదివిస్తున్నారని అన్నారు. అంతేకాకుండా అమ్మ ఒడి పథకాన్ని అమలు చేసి పిల్లల చదువుల భారం తల్లిదండ్రులపై పడకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఉచితంగా యూనిఫామ్, స్కూల్ బ్యాగ్, షూస్, పుస్తకాలు, ఖరీదైన స్టడీ మెటీరియల్‌ను అందించడంతోపాటు ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టిన ఘనత దేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కిందన్నారు. తాను మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన సమయంలో రజకుల సంక్షేమానికి తన వంతు కృషి చేశానన్నారు. టూటౌన్‌లోని సత్య కృష్ణ థియేటర్ వద్ద ఉన్న రజకుల చెరువును పూర్తిగా అభివృద్ధి చేయడంతో పాటుగా రివిట్‌మెంట్ నిర్మించామన్నారు. ఆనాడు అర్హులైన ప్రతి ఒక్కరికి కూడా ఇందిరమ్మ పథకంలో ఇళ్ల స్థలాలను ఇచ్చామన్నారు. ప్రస్తుతం ఆరో వార్డులో రజకుల కమ్యూనిటీ హాలు, 18వ వార్డులో రజకుల చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకున్నామన్నారు. పార్టీలో చేరిన వారిలో యలమంచిలి నరసింహమూర్తి, బొండాడ వీరబ్రహ్మం, వర్షిపతి నాగేశ్వరరావు, కలిశెట్టి శ్రీను, ఇన్నింటి ఆంజనేయులు, గేదెల శ్రీరామ్, జుత్తుగా అనిల్, మద్రి మంచాల నవ్య, వర్షిపతి చంద్రావతి, సోమరపాటి లక్ష్మి, పూడి శ్రీలక్ష్మి, కేతలి సీతమ్మ, మద్ది శ్రీను, ఎలమంచిలి పూజిత, బైరెడ్డి తాతారావు, కేతలి నాగరాజు, ధనికొండ తేజ, ఇల్లూరి సంగేశ్వరరావు, దమన సింగ్ సుకన్యలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు, పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, రెండో పట్టణ జేసీఎ కన్వీనర్ ఏ ఎస్ రాజు, సుబ్బరాజు,చంద్రిక మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో సందడిగా గృహ ప్రవేశాలు



వేల్పూరు జగనన్న కాలనీలో గృహ ప్రవేశానికి హాజరైన మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, తదితరులు


తణుకు టౌన్: ప్రభుత్వం నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో తణుకు మండలం వేల్పూరు గ్రామంలోని జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించుకున్న ఇళ్లల్లో గృహప్రవేశాలు ఆదివారం సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. ఆదివారం నూతన గృహ ప్రవేశాలకు శుభముహూర్తాలు ఉండటంతో తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలతో సందడి నెలకొంది. తణుకు మండలం వేల్పూరు గ్రామంలోని జగనన్న కాలనీలో సుమారు 6 కుటుంబాలు గృహప్రవేశాలు జరుపుకున్నారు. లబ్ధిదారుడు ముని వెంకట రమణ గృహ ప్రవేశ కార్యక్రమానికి రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గృహంలో కొబ్బరికాయ కొట్టి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నూతన గృహం నిర్మించుకున్న దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యులు చుండ్రు శ్యామల, నాయకులు కేఎస్‌వీవీ రమణమూర్తి, కర్రెళ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని బాలుడి దుర్మరణం

ఆకివీడు: పట్టణంలోని సిద్ధాపురం రోడ్డులో వ్యాన్ ఢీకొనడంతో ఓ బాలుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. సిద్ధాపురానికి చెందిన కొట్టాడ వాసుదేవ శ్రీహర్ష (9) ఆదివారం సైకిల్‌పై ఇంటికి వెళుతున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ఓ వ్యాన్ బాలుడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన బాలుడిని చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, తండ్రి లీలా మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.నాగబాబు చెప్పారు. నిందితుడు వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫిట్స్‌తో వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: ఫిట్స్ రావడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెంలో నివసిస్తున్న లంకా మోహన్ అనే వ్యక్తి తాపీ పని చేసుకుని జీవిస్తున్నాడు. ఆదివారం స్థానిక పేరంపేట నాలుగు రోడ్ల కూడలి వద్ద మోహన్‌కు ఫిట్స్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందారు.



మృతిచెందిన లంకా మోహన్

హైదరాబాద్ వెళ్లి పింఛన్ల అందజేత

ఆకివీడు: లబ్ధిదారులు ఎంతదూరంలో ఉన్నా వారికి సకాలంలో పింఛను అందజేస్తూ మానవత్వాన్ని చాటుతున్నారు వలంటీర్లు. మండలంలోని అయిభీమవరం గ్రామానికి చెందిన బూరగ సిద్ధూ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. అతని రెండు కిడ్నీలు పాడవ్వడంతో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈ పరిస్థితిలో కిడ్నీ రోగులకు జగనన్న ఇస్తున్న రూ.10 వేల పింఛను సొమ్మును సకాలంలో అందజేస్తే, రోగికి చేదోడు వాదోడుగా ఉంటుందని భావించి వలంటీర్ ముద్దే కనకదుర్గ గ్రామ సర్పంచ్ గాలి సామ్రాజ్యం సహకారంతో ఆదివారం ఉదయం రైలులో హైదరాబాద్ వెళ్లి సిద్ధూకు పింఛను సొమ్ము అందజేసింది. దీంతో సిద్ధూ, కుటుంబ సభ్యులు ఆనందంతో వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మక్కినవారిగూడెం నుంచి..

టి.నరసాపురం: లబ్ధిదారులు స్థానికంగా అందుబాటులో లేకపోయినా వారు ఉంటున్న చోటుకు వెళ్లి మరీ పింఛన్ అందజేస్తున్నారు వలంటీర్లు. మక్కినవారిగూడెంకు చెందిన వలంటీర్ కుచర్లపాటి రూపశ్రీ హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు విస్సావజ్జుల సుబ్బలక్ష్మి వద్దకు వెళ్లి ఆదివారం పింఛను అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బలక్ష్మి పింఛన్ సొమ్ము తీసుకుంటూ వలంటీర్ రూపశ్రీకి, అలాగే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పారు.

పాలకొల్లు నుంచి..

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని 28వ వార్డుకు చెందిన పింఛను లబ్ధిదారుడు ఎస్.సత్యనారాయణ హైదరాబాద్‌లోని అపోలో హాస్పటల్‌లో గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ దొమ్మేటి వెంకటేష్ వార్డు ఇన్‌చార్జ్ శీలం సూరిబాబుని వెంటపెట్టుకుని హైదరాబాద్ వెళ్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణకు పింఛన్ సొమ్ము రూ.3వేలు అందజేశారు. దీంతో సత్యనారాయణ ఆనందానికి అవధులు లేవు. వలంటీర్ వెంకటేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వెంకటేష్ సేవలను అభినందించారు.

ఏలూరు వెళ్లి..

గణపవరం: ఏలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధురాలికి మానవతా దృక్పథంతో పింఛను సొమ్మును అందచేసింది ఓ వలంటీర్. వివరాల్లోకి వెళితే.. కాశిపాడు గ్రామానికి చెందిన దత్తి దుర్గ అనే వృద్ధురాలు ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కాలికి శస్త్రచికిత్స చేయించుకుంది. లబ్ధిదారురాలు దత్తి దుర్గ ఆస్పత్రిలో ఉన్న విషయం తెలుసుకున్న వలంటీరు నంగిరెడ్డి నాగిని వెంటనే ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వృద్ధురాలికి పింఛను సొమ్మును అందజేసింది. ఆస్పత్రిలో చికిత్సకు డబ్బు అవసరం ఉంటుందన్న ఉద్దేశంతో ఏలూరు వెళ్లి సొమ్ము అందజేసినట్లు నాగిని తెలిపింది. ఈమెను సర్పంచ్ కోటనాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు జంపన పద్మావతి అభినందించారు.



హైదరాబాద్‌లో సిద్ధుకు పింఛను అందజేస్తున్న వలంటీర్ దుర్గ, సర్పంచ్ సామ్రాజ్యం



హైదరాబాద్ ఆసుపత్రిలో వృద్ధురాలు సుబ్బలక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రూపశ్రీ



హైదరాబాద్‌లో సత్యనారాయణకు పింఛను అందిస్తున్న వలంటీర్ దొమ్మేటి వెంకటేష్



ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వృద్ధురాలు దుర్గకు పింఛను అందజేస్తున్న వలంటీర్ నాగిని

క్లుప్తంగా

నేడు అత్తిలిలో మంత్రి కారుమూరి పర్యటన

అత్తిలి: వలంటీర్లు చేస్తున్న సేవలకు గుర్తింపుగా అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపంలో సోమవారం ఉదయం నిర్వహించనున్న వలంటీర్లకు వందనం కార్యక్రమానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు హాజరవుతారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ తెలిపారు. అనంతరం బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో మంత్రి పాల్గొంటారని చెప్పారు. మధ్యాహ్నం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపంలో జగనన్న ఇళ్ల పట్టాల పథకంలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు పత్రాలను మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చేతులు మీదుగా అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పైబోయిన కోరారు.

పన్ను బకాయిల చెల్లింపులపై వడ్డీ రాయితీ

తణుకు అర్బన్: 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఇంటి, ఖాళీ స్థలం పన్ను బకాయిలతో పాటు కుళాయి ఛార్జీల బకాయిలు ఏక మొత్తంగా ఈనెల 31వ తేదీలోపు చెల్లించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ రాయితీ ప్రకటించినట్లు తణుకు మునిసిపల్ కమిషనర్ బీవీ రమణ తెలిపారు. ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెలలో సెలవు రోజుల్లో సైతం మునిసిపల్ కార్యాలయం, సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

అలరించిన పంచరత్న కీర్తనలు



పంచరత్న కీర్తనలు ఆలపిస్తున్న సంగీత విద్యాంసులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సద్గురు త్యాగరాజ స్వామి 83వ ఆరాధనోత్సవాల సందర్భంగా త్యాగరాజ గాన సభ ఆధ్వర్యంలో స్థానిక బీవీఆర్ కళా కేంద్రంలో అమ్మనమంచి బలరామ శాస్త్రి కళావేదికపై ఆదివారం రాత్రి సంగీత విద్వాంసులతో పంచరత్న కీర్తనలు గానం చేశారు. బుద్ధాల వెంకటరామారావు, గరికపాటి బాపయ్య శర్మ, సంగీత విద్వాంసులు, కళాకారులు, బీవీఆర్ సభ్యులు తదితరులు హాజరయ్యారు.

ఘనంగా వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠ



వేణుగోపాలస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న వేదపండితులు, సర్పంచ్ సాంబశివరావు

ఉండి: చెరుకువాడలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్ర మం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగమ మహదాచార్యుడు ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో మహాశాంతి హోమం, మహాపూర్ణాహుతి, గోదర్శనం, శాంతి కల్యాణం, మహదాశీర్వచనం, పండిత సత్కారం, నీరాజన, మంత్రపుష్ప పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సర్పంచ్ కొండవేటి సాంబశివరావు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ గత నెల 27న పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ, వెంటనే వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేవదాయశాఖ రూ.కోటి, భక్తులు, గ్రామ పెద్దలు, ప్రజలు రూ.కోటి విరాళాలతో మొత్తం రూ.2 కోట్లతో రెండు దేవాలయాలు అత్యంత వేగంగా నిర్మాణం కావడం దైవేచ్ఛ అన్నారు. అనంతరం దేవాలయంవద్ద అన్న సమారాధనను ప్రారంభించారు. గ్రామపెద్దలు కొండవేటి సత్తిబా బు, నడింపల్లి కృష్ణంరాజు, సూరగాని బాబూరావు, కొండవేటి సూర్యనారాయణ, సన్నిధి నర్సింహమూర్తి, పెన్మత్స బాబీ, ముత్యాల బాబు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలోని భీమేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయం వద్ద చలువ పందిళ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ప్రతి రోజు స్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, లక్ష పత్రి పూజ నిర్వహించనున్నారు. భక్తులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేశారు. 8న తెల్లవారు జామున స్వామివారి కల్యాణం, ఆలయంలో కొలువైన శ్రీ మహిసాసురమర్దని అమ్మవారికి పలు అమ్మవార్ల అలంకరణ నిర్వహించి ప్రత్యేక పూజలు చేస్తారు. 6న సరస్వతీదేవి, 7న లక్ష్మీదేవి, 8న కనకదుర్గాదేవి, 9న లలితాత్రిపుర దేవి, 10న పార్వతీ దేవి, 9న రథోత్సవము, 10న తెప్పోత్సవము నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణ ముచ్చర్ల శ్రీనివాసరావు ఆదివారం చెప్పారు.

ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేయించాలి

- డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, మంత్రి కారుమూరి పిలుపు
- తణుకు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో పల్స్ పోలియో



తాడేపల్లిగూడెం అర్బన్: చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్, కర్రి భాస్కరరావు



తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురంలో పోలియో చుక్కలు వేస్తున్న సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక



తాడేపల్లిగూడెం (టీఓసీ): వీకర్స్‌కాలనీలో పోలియో చుక్కలను వేస్తున్న పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బోలెం రామలక్ష్మి

తాడేపల్లిగూడెం రూరల్: ఐదేళ్ల లోపు బాలబాలికలకు పోలియో చుక్కలు వేసి పోలియో మహమ్మారి నుంచి చిన్నారులను కాపాడాలని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. దండగర్ర గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016వ సంవత్సరం తర్వాత దేశంలో ఒక్క పోలియో కేసు నమోదు కాలేదన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, ఎమ్పీటీసీలు వీరమళ్ళ వెంకన్న, నార్ని రవికాంత నాగేశ్వరరావు, ఉప్పరగూడెం సర్పంచ్ దండే కనకబాబు, ఆర్బీకే చైర్మన్ ములగాల గంగారావు, ఏడీఏ పి.మురళీకృష్ణ, పీఆర్ డీఈ వేణుగోపాల్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, సచివాలయ కార్యదర్శి అంకం శ్రీరామకృష్ణ, డాక్టర్ ఏవీ వెంకటేష్, వైఎస్సార్సీపీ నాయకులు యాతం సత్యనారాయణ (పెద్దబ్బులు), పత్సా బేబిరాణి, పత్సా రాజు, పూరేటి సత్యనారాయణ (బుజ్జి), సత్తినీడి కొండలరావు, అడ్డాల గోపీకృష్ణ, చిట్టూరి బాపన్న, సచివాలయ సిబ్బంది, హెల్త్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పోలియోరహిత సమాజాన్ని నెలకొల్పాలి

తణుకు అర్బన్: చిన్నారుల భవితవ్యాన్ని చిదిమేసే పోలియో వ్యాధిని తరిమికొట్టేందుకు 5 ఏళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు బ్యాంక్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని ఆదివారం మంత్రి కారుమూరి ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో రహిత సమాజాన్ని నెలకొల్పే ఉద్దేశ్యానికి ప్రతి ఒక్కరూ నడుం కట్టాలన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని రాష్ట్ర వ్యాప్తంగా 53.35 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేసినట్లు చెప్పారు. 37,465 పోలియో బూత్‌లతోపాటు 1693 మొబైల్ టీమ్స్‌ల ద్వారా పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రేపటి నుంచి ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తికిరణ్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, ఏఎంసీ వైస్‌చైర్మన్ మారిశెట్టి బలరామకృష్ణ, నాయకులు సత్తి సురేష్‌రెడ్డి, రేలంగి రాంబాబు, గెద్దాడ శ్రీకాంత్, పైబోయిన ఏసుబాబు, కొమ్మోజు రామకృష్ణ, ఎస్వీ జాకబ్‌బాబు, కట్టా కిషోర్, ఉమ్మిడిసింగ్ శ్రీనివాస్, మొహిద్దీన్, జిలాని పాల్గొన్నారు.

చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాక్సిన్లు అందించాలి

తాడేపల్లిగూడెం అర్బన్: ఐదేళ్లలోపు పిల్లలకు పట్టణంలోని పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కర్రి భాస్కరరావు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం కర్రి భాస్కరరావు మాట్లాడుతూ చిన్నారులకు వైద్యులు సూచించిన విధంగా క్రమం తప్పకుండా వ్యాక్సిన్లు వేయించాలన్నారు.

7,967 మందికి పోలియో చుక్కల పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్: వెంకట్రామన్నగూడెం, మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 8,423 మందిలో 7,967 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీహర్ష, వీరవెంకటేష్ ఆదివారం తెలిపారు. తొలిరోజు వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ పరిధిలో 4,596 మందికి 4,293 మందికి, మాధవరం పీహెచ్‌సీ పరిధిలో 3,827 మందిలో 3,674 మందికి పోలియో చుక్కలు వేసినట్లు వివరించారు. సోమ, మంగళవారాల్లో పోలియో చుక్కల పంపిణీ చేస్తామని తెలిపారు.

పిల్లల భవిష్యత్తు కోసం పల్స్ పోలియో

తాడేపల్లిగూడెం (టీఓసీ): పిల్లల భవిష్యత్తు కోసం పోలియో చుక్కలు తప్పనిసరిగా అందించాలని వైఎస్సార్ సీపీ నాయకురాలు, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బోలెం రామలక్ష్మి, వార్డు ఇన్‌చార్జి నాయకులు బోలెం రమణ పేర్కొన్నారు. పట్టణంలోని వీకర్స్ కాలనీ 4వ వార్డులో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏఎన్ఎం కెంపురత్నం, ఆశ వర్కర్ శ్రీదేవి పాల్గొన్నారు. పట్టణంలోని చిన్న బలుసులమ్మ గుడి వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రి భాస్కర్‌రావు, 10, 12 వార్డుల ఇన్‌చార్జిలు అడ్డాల నరసింహరావు, చామన సూర్యచంద్రరావు, ఏఎంసీ డైరక్టర్ కోడే శ్రీనివాస్ పాల్గొన్నారు.

అత్తిలి మండలంలో..

అత్తిలి: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల వద్ద పలువురు ప్రజా ప్రతినిధులు చిన్నారులకు పోలియో చుక్కలు వేసారు. అత్తిలి పీహెచ్‌లో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, సోమాలమ్మ ఆలయం వద్ద వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాణ, అత్తిలి మట్టపర్తి రామాలయం వద్ద సర్పంచ్ గంటా విజేతనాగరాజు, గోగులమ్మపేటలో ఎంపీటీసీ సభ్యురాలు రంభ సుజాత, సాయిబాబాల ఆలయం వద్ద గల పోలియో కేంద్రంలో ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్ పోలియో చుక్కలు వేసారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కె నాగరాజు, సీహెచ్‌ఓ పి మురళి తదితరులు పాల్గొన్నారు.

95.9 శాతం పల్స్ పోలియో

ఇరగవరం: మండలంలో 95.9 శాతం పల్స్ పోలియో నమోదు అయిందని రేలంగి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె బంగారురవి, డాక్టర్ పి సాయిగిరి ఆదివారం తెలిపారు. వైద్యసిబ్బంది జీకే ఆర్‌సీవీ ప్రసాద్, టి తులసీదేవి, కె అనంతలక్ష్మి, ఎం జయరాజు పాల్గొన్నారు.

విజయవంతంగా పల్స్ పోలియో

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతంగా ముగిసింది. పెంటపాడు, ముదునూరు పీహెచ్‌సీతోపాటు పలు సెంటర్లలో పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పీహెచ్‌సీల పరిధిలో 96 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్టు ముదునూరు, పెంటపాడు వైద్యాధికారులు డాక్టర్ పూజిత, డాక్టర్ మౌనిక, తోట రాజేష్ తెలిపారు. పెంటపాడులో పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు పాల్గొన్నారు.

98 శాతం మందికి పోలియో చుక్కలు

తణుకు టౌన్: పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం తణుకు మండల వేల్పూరు పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 98 శాతం పిల్లలకు పోలియో చుక్కలు అందించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కేఎంఆర్ కిషోర్ తెలిపారు. వైద్యులు డాక్టర్ కె సాయి భవానీ, సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పెంటపాడు పీహెచ్‌సీలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సూరిబాబు

వలంటీర్లకు వందనం



పెంటపాడులో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెంటపాడు: ప్రజలు పథకాలు అందించడంలో వలంటీర్ల పాత్ర ఎనలేనిదని పెంటపాడు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ పేర్కొన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా పెంటపాడు పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామంలోని వలంటీర్లకు నాయకులు సన్మానాలు చేశారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నల్లమిల్లి విజయానందరెడ్డి, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు భాస్కరరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు కర్రి వరహాలరెడ్డి, పలుమూరి ప్రకాష్, వార్డు సభ్యులు జయరాంబాబు, రెడ్డి శ్రీను, మండల సమాఖ్య అధ్యక్షురాలు దాసరి ప్రవీణ, కార్యదర్శి రామారావు, ఎస్సీ నాయకులు తాడేపల్లి ప్రేమ్‌కుమార్, దేవాబత్తుల బాబి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

తణుకులో జిల్లా ఓపెన్ అథ్లెటిక్స్ మీట్



తణుకులో నిర్వహించిన జిల్లా ఓపెన్ అథ్లెటిక్స్ మీట్‌కు హాజరైన క్రీడాకారులు

తణుకు/తణుకు అర్బన్: పశ్చిమగోదావరి జిల్లా ఓపెన్ అథ్లెటిక్స్ మీట్ తణుకులో ఆదివారం నిర్వహించారు. జిల్లా సెక్రటరీ సంకు సూర్యనారాయణ ఆధ్వర్యంలో తణుకు శ్రీచిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ఈ పోటీలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ మానేపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ ఎలుబూడి శ్యాం కుమార్ పేరున ఆయన తండ్రి రాము అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతకాయల సత్యనారాయణ, ట్రెజరర్ కె.బాబూరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కర్రి కృష్ణారెడ్డి, కె.సుబ్బారావు, జాన్సన్, సోమయాజులు, తాతారావు, సుజాత, సంధ్యారాణి, రామారావు, సత్యనారాయణ, వంశీ, స్వాతి, దుర్గ, హేమామాలిని, అనిల్ ఈ పోటీలను పర్యవేక్షించారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

అత్తిలి: మహిళల ఆర్థిక స్వావలంబన కోసం మగవారితో సమానంగా ఆడపిల్లలను పెంచాలని ఐసీడీఎస్ తిరుపతిపురం సెక్టార్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం తిరుపతిపురం, గుమ్మంపాడు, బల్లిపాడు, యర్రనీలిగుంటలో ర్యాలీలు, మానవహారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలన్నారు. ఈ సందర్భంగా మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పులవర్తి గిరిజ, బి రాజకుమారి, జి లక్ష్మీకుమారి, ఎం శివ సత్యవతి, జి శిరీషా, వీరలక్ష్మి, బి స్వరూపారాణి పాల్గొన్నారు.



గుమ్మంపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ ఉద్యోగులు

మహిళా దినోత్సవ వారోత్సవాలు నిర్వహిద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నందున వాటిని విజయవంతం చేద్దామని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పేర్కొన్నారు. పట్టణంలోని రిక్షా వుంత కాలనీలో ఆదివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర్ బాలికలకు, వారి తల్లులకు సమావేశం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ఆడ పిల్లలను చదివించాలని కోరారు. ఆడ పిల్లలకు 18 సంవత్సరాలు నిండే వరకు వివాహం చేయరాదని తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. సూపర్‌వైజర్ సీహెచ్ దుర్గా భావానీ, అంగన్‌వాడీ సభ్యులు గాయత్రి, లక్ష్మికుమారి, ఈశ్వరి, ఎ.ఎస్.ఎం సూర్య చంద్ర పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ నిర్వాహకులు

వైభవంగా కోదండరాముని కల్యాణోత్సవం

తాడేపల్లిగూడెం అర్బన్ : దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో ధర్మ ప్రచార ప్రరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మప్రచార మహోత్సవాల్లో భాగంగా బలుసులమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఆదివారం రాత్రి 7 గంటల నుంచి ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణాన్ని నిర్వహించారు. కొట్టు విశాల్ పాల్గొని పూజలు నిర్వహించారు. కోదండరాముని కల్యాణం అనంతరం స్వామి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమాలను ఆయా దేవస్థానాల నిర్వహణ అధికారులు, సిబ్బందితో పాటు బలుసులమ్మ దేవస్థానం ఈఓ రవిశంకర్, ఆలయ చైర్మన్ కొట్టు అంజిబాబు, కర్రి భాస్కరరావు, వట్టిప్రోలు రాము, అప్పన రమేష్‌కుమార్, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.



తాడేపల్లిగూడెంలో ఒంటిమిట్ట కోదండ రాముని కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

అలంపురం వద్ద కారు బోల్తా

పెంటపాడు: అలంపురం వెంకయ్య కాలువ వద్ద తణుకు వైపు రోడ్డుపైకి వస్తున్న సమయంలో ఒక కారు ఆదివారం మధ్యాహ్నం ప్రమాదానికి గురైంది. పెనుమంట్ర మండలం మార్టేరుకు చెందిన నలుగురు కుటుంబ సభ్యులు ఉంగుటూరు మండలంలో నిర్వహించే ఒక కార్యక్రమానికి వెళ్లి తిరిగి స్వగ్రామం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. అలంపురం వెంకయ్యకాలువ సమీపంలో రోడ్డు ఎక్కుతూ కారు అదుపుతప్పి డివైడర్ అవతల వైపున బోల్తా పడింది. కారులో ఉన్నవారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ విషయంపై పెంటపాడు పోలీసులకు సమాచారం అందలేదని తెలిపారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచితవైద్య సేవల కార్యక్రమంలో భాగంగా ఆదివారం తణుకులోని వివిధ ప్రాంతాల్లోని 9 మంది వృద్ధులకు ఇంటి వద్దనే వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి తగు ఆరోగ్య సూచనలు, సలహాలను అందించారు. అసోసియేషన్ సభ్యుడు పాతూరి శివన్నారాయణ ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పెద్దలు రాధమ్మ, నిర్వాహకురాలు చిట్టూరి సుజాత, అసోయేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

7న చిలుకూరులో క్రైస్తవ మహాసభ

ఉండి: చిలుకూరులోని సెయింట్ థోమా లూథరన్ చర్చ్ ఆధ్వర్యంలో ఈ నెల 7న శిలువ ధ్యాన కూడిక మహాసభను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు దుండె హరినాథ్, ఇజ్జిని షాలేంరాజు ఆదివారం తెలిపారు. సాయంత్రం 6గంటలకు సంఘ సీఆర్ యువరాజు అధ్యక్షతన నిర్వహించే ఈ సభలో అంతర్జాతీయ ప్రసంగీకుడు దైవసేవకుడు టీ జఫన్యాశాస్త్రి (విశాఖపట్నం) వాక్యోపదేశం చేస్తారన్నారు. విశ్వాసులు అధిక సంఖ్యలో ఈ మహాసభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు ప్రారంభోత్సవాలు

ఆకివీడు: ఉండి నియోజకవర్గంలో సోమవారం నుంచి పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆదివారం చెప్పారు. నిర్మాణం పూర్తి చేసుకున్న సచివాలయ భవనాలు, ఆర్‌బీకే భవనాలు, హెల్త్ క్లినిక్‌లు, రహదారుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. పేదలకు ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ కార్యక్రమాల్ని చేపడుతున్నామన్నారు.

అభివృద్ధికి చిరునామాగా ఉండి

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: నియోజకవర్గ కేంద్రం ఉండి అభివృద్ధికి చిరునామాగా మారిందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఉండి రాజులపేటలో జెడ్పీ నిధులు రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్ పనులను ఆదివారం పీవీఎల్, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఉండి గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిందన్నారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లోని మారుమూల ప్రాంతాల్లో కూడా సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రెయిన్‌ల నిర్మాణం చేపడుతూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడుపుతున్నామన్నారు. సంక్షేమ పాలనతో ప్రజలంతా లక్షాధికారులుగా మారారన్నారు. అర్హత ఉంటే చాలు వారికి సంక్షేమ పథకాలతో పాటు ఇంటిస్థలం ఇచ్చి ఇల్లు కట్టిస్తూ వారి జీవితాన్ని సంతోషంగా మార్చామన్నారు. అంతేకాకుండా నిరుపేదల పిల్లలు ఉన్నత చదువులు చదువుకునేలా సీఎం వైఎస్ జగన్ అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు మాట ఇస్తే తప్పకుండా చేయడు అని ప్రజలంతా నమ్ముతున్నారన్నారు. కానీ సీఎం జగన్ మాట ఇచ్చాడంటే చేసి తీరుతాడనే నమ్మకంతో ప్రజలంతా ఆయన వెంటే ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉండిలో భారీ మెజార్టీతో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమన్నారు. మోసం చేసి ఓట్లు దండుకుని ముఖం చాటేసేవారిని ఇంటికి పంపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కమతం సౌజన్య, ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వరరావు, గులిపల్లి అచ్చారావు, కమతం బెనర్జీ, కరిమెరక మల్లికార్జున, కరిమెరక శివనాగరాజు, రాయి సతీష్, బడుగు బాలాజీ పాల్గొన్నారు.



ఉండి రాజులపేటలో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు